


EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
సోమవారం
06-10-2025
పేజీలు: 02



## మెట్రో స్టేషన్‌లో కిక్కిరిసిన ప్రయాణికులు

దసరా పండుగ సెలవులు ముగియడంతో సొంతూళ్లకు వెళ్లిన ప్రయాణికులు నగరానికి తిరుగు ప్రయాణం అయ్యారు. ఆదివారం సాయంత్రం నుంచే నగరానికి క్యూ కట్టారు. దీంతో టోల్ గేట్లు, బస్‌స్టాండ్లు మాత్రమే కాక.. మెట్రో రైల్వే స్టేషన్లు కూడా జనంతో కిటకిటలాడుతున్నాయి. ముఖ్యంగా.. సిటీకి ముఖద్వారం వంటి ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ వద్ద పరిస్థితి తీవ్రంగా మారింది. ప్రయాణికులు పెద్ద ఎత్తున స్టేషన్‌కు పోటెత్తటంతో ఎల్బీనగర్ ప్రాంతం జనజాతరను తలపిస్తోంది.
ఒక కిలోమీటర్ మేర క్యూ లైన్
ఎల్బీనగర్ మెట్రో స్టేషన్‌ను నమ్ముకున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రద్దీని నియంత్రించడంలో భాగంగా మెట్రో సిబ్బంది ప్రయాణికులను క్యూ పద్ధతిలో పంపించాల్సి వస్తోంది. అయితే ఈ క్యూ లైన్ ఏకంగా ఒక కిలోమీటర్ మేర విస్తరించడం గమనార్హం. ఈ భారీ రద్దీ కారణంగా.. ప్రయాణికులు క్యూ లైన్‌లో నిలబడి ప్లాట్‌ఫారం చేరడానికి సుమారు రెండు గంటల సమయం పడుతోంది. ఇంత సుదీర్ఘ సమయం వేచి ఉండాల్సి రావడంతో.. ప్లాట్‌ఫారం ఎక్కేందుకు వేచి చూస్తున్న ప్రయాణికులు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఎల్బీనగర్ స్టేషన్.. పండుగ సెలవుల అనంతరం మరింత రద్దీగా మారి మెట్రో సిబ్బందికి కూడా రద్దీని నియంత్రించడం కష్టంగా మారింది. నగరంలోకి ప్రవేశించే ప్రధాన మార్గాల్లో ఒకటిగా ఉన్న ఎల్బీనగర్ మెట్రో స్టేషన్, పాత, కొత్త నగరాలను కలిపే ముఖ్య కూడలి కావడంతో రద్దీ పెరిగిన ప్రతిసారీ ఈ తరహా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మెట్రో అధికారులు రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు టికెట్ కౌంటర్లు, మరిన్ని రైళ్లను నడపడం ద్వారా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రయాణికులు కోరుతున్నారు.ఇక విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై వరుసగా రెండో రోజు భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ముఖ్యంగా.. నల్గొండ జిల్లాలోని చిట్యాల నుంచి పెద్దకాపర్తి వరకు దాదాపు 4 కిలోమీటర్ల మేర వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పెద్దకాపర్తి, చిట్యాల ప్రాంతాల్లో జరుగుతున్న వంతెన నిర్మాణ పనుల కారణంగా ఈ ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమైంది. పనుల వల్ల రోడ్డు ఇరుకుగా మారడంతో వాహనాలు అత్యంత నెమ్మదిగా కదులుతున్నాయి. జాతీయ రహదారిపై రద్దీ కేవలం వంతెనల వద్దే కాకుండా.. పంతంగి టోల్ ప్లాజాతో పాటు చౌటుప్పల్, దండు మల్కాపురం వంటి ప్రాంతాల్లో కూడా వాహనాలు బారులు తీరాయి. వేలాది వాహనాలు ఒకేసారి నగరానికి చేరుకోవడంతో ఈ కీలక ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే ప్రయత్నం చేస్తున్నారు. హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ పరిధి చింతలకుంట నుంచి కొత్తపేట వరకు భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఇక్కడ చింతలకుంట పైవంతెనపై ట్రావెల్స్ బస్సులు నిలిచిపోవడంతో పరిస్థితి మరింత దిగజారింది. ఈ ట్రాఫిక్ జామ్ కారణంగా ఉదయాన్నే కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, దినసరి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

# ఉప ఎన్నిక ప్రచారంపై మీనాక్షి, మహేశ్‌గౌడ్ సమీక్ష

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థిత్వానికి నలుగురు నేతల పేర్లను ఇన్‌చార్జి మంత్రులు ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. స్థానిక నేతలు నవీన్ యాదవ్, సీఎన్ రెడ్డి, జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, అంజన్‌కుమార్ యాదవ్‌ల పేర్లను వారు ప్రతిపాదించినట్లు సమాచారం. గెలిచే అవకాశం ఉన్న నేతల పేర్లను ప్రతిపాదించాల్సిందిగా ఉప ఎన్నికకు ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, వివేక్ వెంకటస్వామికి సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల సూచించిన విషయం తెలిసిందే. ఈ మేరకు అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని నాలుగు పేర్లను ప్రతిపాదిస్తూ టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌కు వారు నివేదిక ఇచ్చినట్లు తెలుస్తోంది. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్ ఆదివారం ఢిల్లీకి వెళ్లడానికి ముందు ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్,



పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్‌తో భేటీ అయ్యారు. సీఎం రేవంత్ సూచన మేరకు జరిగిన ఈ భేటీలో ఢిల్లీలో చేపట్టాల్సిన కార్యాచరణతోపాటు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ప్రతిపాదించిన నాలుగు పేర్ల పైనా ప్రాథమికంగా చర్చించారు. దీనిపై సోమవారం లేదా మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డితో భట్టివిక్రమార్క, మహేశ్‌గౌడ్, మీనాక్షీ నటరాజన్, మంత్రి ఉత్తమ్ సమావేశమై చర్చించనున్నట్లు తెలిసింది. సర్వేలు, నివేదికల ఆధారంగా ఆశావహుల జాబితాను షార్ట్‌లిస్ట్ చేసి మూడు పేర్లతో అధిష్ఠానానికి ప్రతిపాదన పంపనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రచారం జరుగుతున్న తీరుపై మీనాక్షీ నటరాజన్, మహేశ్‌గౌడ్ ఆదివారం ప్రజాభవన్‌లో సమీక్ష నిర్వహించారు. మంత్రి తుమ్మల, డివిజన్ల వారీ ఇన్‌చార్జులుగా ఉన్న వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. ఎన్నికల ప్రచారం వ్యక్తి కేంద్రీకృతంగా కాకుండా పార్టీ, సిద్ధాంతం కేంద్రీకృతంగా సాగాలని మహేశ్‌గౌడ్, మీనాక్షి సూచించారు. అభ్యర్థిని సర్వేల ఆధారంగా అధిష్ఠానం నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు.

## బీసీ రిజర్వేషన్లపై పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు

బీసీ రిజర్వేషన్లపై సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి ఊరట లభించింది. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. హైకోర్టులో పెండింగ్‌లో ఉండటంతో విచారణకు స్వీకరించలేమని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను తిరస్కరించింది. తెలంగాణ స్థానిక ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ల పెంపుపై వంగా గోపాల్‌రెడ్డి అనే వ్యక్తి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ జరిపిన ద్విసభ్య ధర్మాసనం.. హైకోర్టులో విచారణలో ఉండగా ఇక్కడకు ఎందుకు వచ్చారని పిటిషనర్ తరఫు లాయర్‌ను ప్రశ్నించింది.

# వన్డేల్లో పాకిస్థాన్‌పై 12వ విజయం

అంతర్జాతీయ క్రికెట్‌లో వరుసగా నాలుగో ఆదివారం పాకిస్థాన్‌కు భారత్ చేతిలో భంగపాటు తప్పలేదు. ఇటీవలే ముగిసిన ఆసియా కప్‌లో భారత పురుషుల జట్టు మూడుసార్లు పాకిస్థాన్ జట్టును చిత్తుచేయగా తాజాగా అమ్మాయిలూ ఆ విజయ పరంపరను కొనసాగించారు. మహిళల వన్డే ప్రపంచకప్‌లో భాగంగా చిరకాల ప్రత్యర్థుల మధ్య కొలంబో వేదికగా జరిగిన పోరులో భారత్.. 88 పరుగుల తేడాతో గెలిచి జయభేరి మోగించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఉమెన్ ఇన్ బ్లూ.. బ్యాట్‌తో తడబాటుకు గురై నిర్ణీత ఓవర్లలో 247 పరుగులే చేయగలిగింది. హర్లీన్ డియోల్ (46), రిచా ఘోష్ (35) ఫర్వాలేదనిపించారు. బ్యాట్‌తో విఫలమైనా బంతితో మెరిసిన భారత్.. పాక్‌ను 43 ఓవర్లలో 159కే కట్టడిచేసింది. క్రాంతి గౌడ్ (3/20) పదునైన పేస్‌కు తోడు దీప్తి శర్మ (3/45), స్నేహ్ రాణా (2/38) స్పిన్ మాయాజాలానికి దాయాది కుదేలైంది. సిద్ర అమిన్ (81) ఒంటరిపోరాటం చేసినా ఆ జట్టును గెలిపించలేకపోయింది. కాగా వన్డేల్లో పాక్‌పై భారత్ ఆడిన 12 మ్యాచ్‌ల్లో ఇది 12వ విజయం కావడం విశేషం. ఈ మ్యాచ్‌లోనూ భారత్.. పాకిస్థాన్‌తో 'నో షేక్‌హ్యాండ్' విధానాన్ని కొనసాగించింది. మ్యాచ్ రిఫరీ షండ్రె ఫ్రిట్జ్ తప్పిదం వల్ల టాస్ భారత్ గెలిచినా పాక్ సారథి ఆహ్వానం



మేరకు మొదట బ్యాటింగ్ చేసిన టీమ్ఇండియాకు మంచి ఆరంభమే దక్కింది. ఓపెనర్లు ప్రతీక రావల్ (31), స్మృతి మంధాన (23) 9 ఓవర్లకు 48 రన్స్ జోడించారు. కానీ స్మృతి నిష్క్రమించాక భారత బ్యాటింగ్ లైనప్ తడబడింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (19) విఫలమైనా హర్లీన్, జెమీమా రోడ్రిగ్స్ (32) ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. స్వల్ప వ్యవధిలో ఈ ఇద్దరూ ఔట్ అవడంతో స్కోరువేగం మందగించింది. మధ్య ఓవర్లలో రిచాను కాదని స్నేహ్ రాణాను బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకుపంపినా దీప్తితో కలిసి ఆమె వేగంగా ఆడలేకపోయింది. ఆఖర్లో రిచా ఘోష్ ధనాధన్ మెరుపులతో భారత్ పోరాడగలిగే స్కోరును చేయగలిగింది. పాక్ బౌలర్లలో డయానా బేగ్ (4/69) నాలుగు వికెట్లు తీసింది.నాలుగో వికెట్‌కు ఈ జోడీ 69 రన్స్ జోడించింది. అయితే 28వ ఓవర్లో మళ్లీ బంతినందుకున్న క్రాంతి.. నటాలియాను ఔట్ చేసింది. ఆమె స్థానంలో వచ్చిన ఫాతిమా (2)ను దీప్తి పెవిలియన్‌కు పంపింది. 30వ ఓవర్లో పాక్ స్కోరు వంద పరుగులు దాటింది. సాధించాల్సిన రన్‌రేట్ పెరుగుతుండటంతో 81 బంతుల్లో అర్ధ శతకం పూర్తిచేసిన సిద్ర.. గేర్ మార్చి దూకుడుగా ఆడేందుకు యత్నించింది. కానీ మరో ఎండ్‌లో ఆమెకు అండగా నిలిచేవారే కరువయ్యారు. ఒకదశలో 143/5తో ఉన్న పాక్.. 159కు ఆలౌట్ అవడం గమనార్హం.



## 8 మంది ఎంపీలు ఉండి, రాష్ట్రానికి కనీసం 8 యూరియా బస్తాలైన తెచ్చారా?



రాష్ట్ర బీజేపీ నేతలపై కూడా మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. తెలంగాణ ప్రజలు ఎంతో నమ్మకంతో 8 మంది ఎంపీలను గెలిపిస్తే, వారు రాష్ట్రానికి కనీసం 8 యూరియా బస్తాలు కూడా తీసుకురాలేకపోయారని ఎద్దేవా చేశారు. బీజేపీకి ఓటు వేయడం వృథా అని ఆ పార్టీ ఎంపీలే స్వయంగా నిరూపించారని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో బీజేపీ నేతలు ఏం చేస్తున్నారో వారికే తెలియడం లేదని పరిహసించారు. రైతుల సమస్యలపై మాట్లాడుతూ, రాష్ట్రంలో వెంటనే మక్క, సోయా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని ప్రశాంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## హాట్ ఫొటోలతో వైరల్ వయ్యారి శ్రీలీల

టాలీవుడ్ హీరోయిన్ శ్రీలీల తాజాగా సోషల్ మీడియాలో హాట్ ఫోటోలతో కుర్రకారులో రచ్చరేపింది. స్లీవ్ లెస్ గ్రీన్ అవుట్ ఫిట్ ఫోటో షూట్ స్టిల్స్ తో అభిమానులకు అందాల విందు చేసింది. గ్లామర్ డాల్ శ్రీలీల ఇలా అందాల ఆరబోతతో ఒక్కసారిగా అందరిని అటెన్షన్ కు గురి చేసింది. మాస్ మహారాజ్ రవితేజ హీరోగా సామజవరగమన ఫేం రైటర్ భాను బొగవరపు దర్శకత్వంలో వస్తున్న చిత్రం మాస్ జాతర శ్రీలీల నటిస్తుంది. ఈ మూవీ అక్టోబర్ 31న గ్రాండ్‌గా విడుదలవుతుందని ఇప్పటికే మేకర్స్ ప్రకటించారు. సినిమా విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో మేకర్స్ ప్రమోషన్ మొదలుపెట్టారు. ఇంతలోనే శ్రీలీల తన హాట్ ఫోటోస్ తో మాస్ ఫ్యాన్స్ ను షేక్ చేశారు. మాస్ జాతర మూవీని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి బలగం ఫేమ్ భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నాడు.



## సాయంత్రం 4 గంటలకు.. బీహార్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్

బీహార్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ మరికొన్ని గంటల్లో విడుదల కానుంది. సోమవారం సాయంత్రం 4 గంటలకు కేంద్ర ఎన్నికల సంఘం మీడియా సమావేశం నిర్వహించనుంది. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎన్నికల తేదీలను ప్రకటించనుంది. దీంతోపాటు దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న శాసనసభ స్థానాలకు కూడా ఉప ఎన్నికల షెడ్యూల్‌ను వెల్లడించనున్నట్లు తెలుస్తున్నది. 243 స్థానాలు కలిగిన బీహార్ అసెంబ్లీకి నవంబర్ 22తో గడువు ముగియనుంది. ఈలోగా కొత్త ప్రభుత్వం కొలువుదీరాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించిన ఈసీ.. గడువులోగా ఎన్నికలు పూర్తిచేస్తామని ఇప్పటికే ప్రకటించింది. కాగా, 2020లో జరిగిన ఎన్నికల్లో మూడు విడతల్లో పోలింగ్ జరుగగా.. అంతకుముందు ఐదు విడతల్లో పోలింగ్ నిర్వహించారు. బీహార్‌లో 7.42 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్లు ఈసీ వెల్లడించింది. సెప్టెంబర్ 30న ఓటర్ల జాబితాను ప్రచురించింది. కాగా, ఎన్నికల ప్రక్రియలో నిష్పాక్షికత, పారదర్శకత కోసం తీసుకొచ్చిన 17 సంస్కరణలను బీహార్ ఎన్నికల నుంచే అమలు చేయనుంది.

EVENING EDITION
సోమవారం | 06 అక్టోబర్ 2025
www.suryaa.com 4PM
సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



## అమెరికాలోని అలబామాలో కాల్పుల కలకలం

అమెరికాలో అలబామా రాష్ట్ర రాజధాని మాంట్‌గోమరి నగరంలో రెండు ప్రత్యర్థి వర్గాలు నడిరోడ్డుపై ఒకరిపై ఒకరు కాల్పులకు తెగబడ్డాయి. జనసమర్ధం అధికంగా ఉన్న ప్రాంతంలో జరిగిన ఈ దారుణ ఘటనలో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోగా, మరో 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల్లో ఏడుగురు 17 ఏళ్ల లోపు మైనర్లు ఉండటం ఆందోళన కలిగిస్తోంది.స్థానిక కాలమానం ప్రకారం శనివారం రాత్రి 11:30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. నగరంలోని పర్యాటక ప్రాంతంలో ఉన్న ఓ కూడలి వద్ద జనం గుమిగూడి ఉన్న సమయంలో రెండు వర్గాలు ఒక్కసారిగా కాల్పులు ప్రారంభించాయి. ఇది ఒక భారీ కాల్పుల ఘటన అని మాంట్‌గోమరి పోలీస్ చీఫ్ జేమ్స్ గ్రాబోయ్స్ మీడియాకు వెల్లడించారు. "రెండు వర్గాలు చుట్టూ ఉన్న జనాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా ఒకరిపై ఒకరు కాల్పులు జరుపుకున్నాయి" అని ఆయన తెలిపారు. గాయపడిన 12 మందిలో ముగ్గురి పరిస్థితి అత్యంత విషమంగా ఉందని అధికారులు తెలిపారు. మృతుల్లో ఒకరు మహిళ అని పోలీసులు గుర్తించారు. క్షతగాత్రుల్లో అత్యంత చిన్న వయసున్న వ్యక్తి వయసు 16 సంవత్సరాలు. స్థానికంగా రెండు కాలేజీల మధ్య ఫుట్‌బాల్ మ్యాచ్ ముగిసిన కొద్దిసేపటికే ఈ ఘటన జరగడంతో ఆ ప్రాంతం రద్దీగా ఉంది.ఈ ఘటనపై నగర మేయర్ స్టీవెన్ రీడ్ తీవ్రంగా స్పందించారు.



## పదో తరగతి అర్హతతో రైల్వేలో ఉద్యోగాలకు నోటిఫికేషన్

రాజస్థాన్ రాష్ట్రంలోని జైపుర్ రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్ (ఆర్ఆర్‌సీ).. నార్త్ వెస్ట్రన్ రైల్వే (NWR) ఎన్‌డబ్ల్యూఆర్ పరిధిలో వర్క్‌షాప్, యూనిట్‌లలో భారీగా యాక్ట్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ కింద మొత్తం 2,094 ఖాళీలను భర్తీ చేయనుంది. డివిజనల్ రైల్వే మేనేజర్ ఆఫీస్ (అజ్‌మేర్), డివిజనల్ రైల్వే మేనేజర్ ఆఫీస్ (బికనీర్), డివిజనల్ రైల్వే మేనేజర్ ఆఫీస్ (జైపుర్), డివిజనల్ రైల్వే మేనేజర్ ఆఫీస్ (జోధ్‌పుర్), బీటీసీ క్యారేజ్ (అజ్‌మేర్), బీటీసీ లోకో (అజ్‌మేర్), క్యారేజ్ వర్క్స్ షాప్ (బికనీర్), క్యారేజ్ వర్క్స్ షాప్ (జోధ్‌పుర్).. వర్క్‌షాప్‌లు, యూనిట్లలో ఈ ఖాళీలను భర్తీ చేయనుంది. యాక్ట్ అప్రెంటిస్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కుల పదో తరగతిలో ఉత్తీర్ణత పొంది ఉండాలి. అలాగే సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి. ఎలక్ట్రికల్, కార్పెంటర్, పెయింటర్, మేసన్, పైప్ ఫిట్టర్, ఫిట్టర్, కార్పెంటర్, డీజిల్ మెకానిక్, వెల్డర్, మెకానికల్, డీజిల్ మెకానికల్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్ తదితర ట్రేడుల్లల్లో ఖాళీలు ఉన్నాయి. అభ్యర్థుల వయోపరిమితి నవంబర్ 02, 2025 నాటికి 15 నుంచి 24 సంవత్సరాల మధ్య వయసు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్ విధానంలో నవంబర్ 2, 2025వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు రుసుము కింద జనరల్ అభ్యర్థులు రూ.100 చెల్లించవల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఎలాంటి ఫీజు లేదు. మెట్రిక్యులేషన్, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది. ఇతర వివరాలు ఈ కింది డైరెక్ట్ లింక్ ద్వారా చెక్ చేసుకోవచ్చు.



## ఎమ్మెల్యే పదవికి రాజీనామా అంటూ వస్తున్న వార్తలపై దానం స్పందన

తన పదవికి రాజీనామా చేస్తున్నానంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి దానం నాగేందర్ తీవ్రంగా స్పందించారు. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, అదంతా కేవలం దుష్ప్రచారం మాత్రమేనని ఆయన కొట్టిపారేశారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడి పూర్తి స్పష్టతనిచ్చారు.తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడం లేదని, ఈ పుకార్లను ఎవరూ నమ్మవద్దని దానం నాగేందర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. "నాపై గిట్టనివాళ్లే ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. నేను రాజీనామా చేస్తున్నాననే వార్త పూర్తిగా అవాస్తవం" అని ఆయన తేల్చిచెప్పారు. తనపై రాజకీయంగా కుట్ర జరుగుతోందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. పార్టీకి, ప్రజలకు తాను ఎప్పుడూ అంకితభావంతో పనిచేస్తానని, పదవులు వదులుకునే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్‌లో కీలక నేతగా ఉన్న దానం నాగేందర్, ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరి మంత్రిగా కూడా పనిచేశారు. ఇటీవలే తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన, ఖైరతాబాద్ నియోజకవర్గంలో బలమైన నేతగా కొనసాగుతున్నారు. ఇలాంటి తరుణంలో ఆయన రాజీనామాపై వస్తున్న వదంతులు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.ఈ కష్టకాలంలో తనకు మద్దతుగా నిలుస్తున్న ప్రజలకు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ దుష్ప్రచారం వెనుక ఎవరున్నారనే దానిపై త్వరలోనే మరిన్ని వివరాలు వెల్లడిస్తానని దానం నాగేందర్ సూచనప్రాయంగా తెలిపారు.



## హాట్ బ్యూటీ దిశా

తెలుగులో ఎంతో మంది ముద్దుగుమ్మలు తమ అందచందాలతో, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కానీ ఆతర్వాత టాలీవుడ్ కు దూరం అయ్యారు. తెలుగులో కొన్ని సినిమాలే చేసి ఆ తర్వాత బాలీవుడ్ కు చెక్కేసినవారు చాలా మంది ఉన్నారు. కొంతమంది ముద్దుగుమ్మలు ఒకటి రెండు సినిమాలతోనే పరిమితం అవుతున్నారు. పెళ్లి చేసుకొనో.. లేక అవకాశాలు లేక సినిమాలకు దూరం అయ్యారు. ఒక ముద్దుగుమ్మ తెలుగులో రెండే సినిమాలు చేసింది. అందులో ఒకటి డిజాస్టర్ కాగా ఓ సినిమా సంచలన విజయం సాధించింది. కానీ ఈ బ్యూటీకి ఆఫర్స్ మాత్రం లేదు. ఇప్పుడు ఒకొక్క సినిమాకు రూ. 3 కోట్లు వసూల్ చేస్తుంది ఈ చిన్నది. అలాగే ఆమె ఆస్తి పాస్తులు కూడా కోట్లల్లో ఉన్నాయి. అంతే కాదు ఇండస్ట్రీలో ఆమెను మించిన హాట్ బ్యూటీ లేదు. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా..?ఇండస్ట్రీలో హాట్ బ్యూటీగా పేరు తెచ్చుకుంది ఆమె.. అందంలో అప్సరస.. కానీ తెలుగులో చేసిన సినిమాలు మాత్రం రెండు సినిమాలే ఒకటి డిజాస్టర్, మరో సినిమా భారీ హిట్. ఆమె ఎవరో కాదు దిశా పటాని. ఈ హాట్ బ్యూటీ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు.



## పత్తికొండ మార్కెట్లో దారుణంగా పడిపోయిన టమాటా ధర

కంటికి రెప్పలా కాపాడుకున్న పంటకు కనీస ధర కూడా దక్కకపోవడంతో అన్నదాతలు కన్నీరు పెట్టుకున్నారు. కర్నూలు జిల్లా పత్తికొండ మార్కెట్‌లో టమాటా ధర ఒక్కసారిగా కుప్పకూలింది. కిలో ధర కేవలం రూపాయికి పడిపోవడంతో ఆగ్రహించిన రైతులు, తాము పండించిన టమాటాలను రోడ్డుపై పారబోసి తీవ్ర నిరసన చేపట్టారు. టమాటాలతో నిండిన బుట్టలను రహదారిపై కుమ్మరించి తమ ఆవేదనను వ్యక్తం చేశారు.ఈ నిరసన కారణంగా పత్తికొండలోని గుత్తి-మంత్రాలయం ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. రైతులు పెద్ద ఎత్తున రోడ్డుపై బైఠాయించడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి తమను ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. టమాటాకు గిట్టుబాటు ధర కల్పించాలని, అలాగే ఎప్పటినుంచో నిర్మాణంలో ఉన్న టమాటా జ్యూస్ ఫ్యాక్టరీని వెంటనే పూర్తి చేయాలని కోరారు.తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, రైతులతో చర్చలు జరిపి ట్రాఫిక్‌ను పునరుద్ధరించే ప్రయత్నం చేశారు. అష్టకష్టాలు పడి పండించిన పంటకు రవాణా ఖర్చులు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు.

## తెలంగాణలో దగ్గు సిరప్ నిషేధం: ప్రభుత్వ కీలక నిర్ణయం




దేశవ్యాప్తంగా చిన్నారుల మరణాలకు కారణమవుతున్న కోల్డ్ రిఫ్ దగ్గు సిరప్‌పై నిషేధం వరుసగా కొనసాగుతోంది. మధ్యప్రదేశ్‌లో ఈ సిరప్ వల్ల 11 మంది చిన్నారులు మృతి చెందారు. ఈ ఘటనలపై రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తీవ్రంగా స్పందించి, రాష్ట్రవ్యాప్తంగా కోల్డ్ రిఫ్ సిరప్ అమ్మకాలు నిషేధించేందుకు ఆదేశాలు జారీ చేశారు.ఈ సంఘటన తర్వాత, రాజస్థాన్, తమిళనాడు, కేరళల్లో కూడా ముగ్గురు చిన్నారులు ప్రాణాలు కోల్పోవడంతో ఆయా రాష్ట్రాల్లోనూ సిరప్‌పై నిషేధం విధించబడింది.తాజాగా, తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ సిరప్‌ను నిషేధిస్తూ కీలక ప్రకటన చేసింది. ప్రజలు ఈ సిరప్‌ను వినియోగించకూడదని హెచ్చరిస్తూ, రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (DCA) అధికారికంగా సూచించింది. ఈ నేపథ్యంలో ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ ఓ ప్రకటన విడుదల చేసింది.దేశ వ్యాప్తంగా చిన్నారుల మృతితో కేంద్ర ప్రభుత్వం కూడా అప్రమత్తమైంది. అనేక రాష్ట్రాలు కోల్డ్ రిఫ్ సిరప్‌ను తక్షణం నిలిపివేస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఈ దిశగా స్పందించి, మార్కెట్ల నుంచి ఈ సిరప్‌ను ఉపసంహరించాలంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

★ప్రమాదకరమైన బ్యాచ్ వివరాలు:ఈ సిరప్‌ను తమిళనాడులోని కాంచీపురం జిల్లాలో ఉన్న శ్రీసాన్ ఫార్మా తయారు చేసింది. సమస్యాత్మకంగా గుర్తించబడిన బ్యాచ్ నెం: SR-13, తయారీ తేది మే 2025, గడువు తేది ఏప్రిల్ 2027. దీనిలో పారాసిటమాల్, ఫెనైల్‌ఎఫ్రిన్ హైడ్రోక్లోరైడ్, క్లోరోఫెన్నిరామిన్ మలియేట్ వంటి ఘాటైన కాంపౌండ్లు ఉన్నాయి.ఈ బ్యాచ్‌కు చెందిన సిరప్ ఎవరి వద్దనైనా ఉన్నా, వెంటనే వాడకూడదని, స్థానిక డ్రగ్ కంట్రోల్ అధికారులను సంప్రదించాలని తెలంగాణ DCA సూచిస్తోంది. అలాగే, ఈ ఉత్పత్తి సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్: 1800-599-6969 (ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5:00 వరకూ) కాల్ చేసి తెలియజేయవచ్చని పేర్కొంది.

## జైపుర్‌లోని దవాఖానలో అగ్నిప్రమాదం.. ఆరుగురు రోగులు మృతి

రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఆదివారం రాత్రి జైపుర్‌లోని ప్రభుత్వం నిర్వహిస్తున్న సవాయ్ మాన్‌సింగ్ హాస్పిటల్‌లో ఉన్న ట్రామా సెంటర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ఐసీయూలో చికిత్స పొందుతున్న ఆరుగురు రోగులు మృతి చెందారు. వారిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. ప్రమాద సమయంలో ట్రామా ఐసీయూలో 11, సెమీ ఐసీయూలో 13 మంది చికిత్స పొందుతున్నట్లు ట్రామా సెంటర్ ఇన్‌చార్జి అనురాగ్ ధకడ్ వెల్లడించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగి ఉండవచ్చని తెలిపారు. ఐసీయూలో మంటలు చెలరేగడం, రెండో ఫ్లోర్ మొత్తానికి పొగవ్యాపించడంతో రోగులు, వారి సహాయకులు హాహాకారాలు పెట్టారు. దీంతో దవాఖాన సిబ్బంది కొందరు రోగులను సురక్షితంగా బయటకు తరలించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది దాదాపు రెండు గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఐసీయూ పరికరాలు, రక్త నమూనా టబ్స్, పేషెంట్ల చికిత్సకు సంబంధించిన కేస్ షీట్లు, వివిధ డాక్యుమెంట్లు, ఇతర పరికరాలు అగ్నికి ఆహుతయ్యాయి. కాగా, ప్రమాదం జరిగిన తర్వాత హాస్పిటల్ సిబ్బంది అక్కడి నుంచి పారిపోయారని రోగుల బంధువులు ఆరోపించారు. ఐసీయూలో మంటలను ఆర్పేందుకు సిలిండర్లు సహా ఎలాంటి పరికరాలు లేవని చెప్పారు.

